క్లుప్తంగా

ముగిసిన ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ ఎన్నికలు


వేణుగోపాల్


శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీమంతుల వేణుగోపాల్ గెలుపొందారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీమంతుల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సాక్షి రిపోర్టర్ వారణాసి శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కలకుంట్ల శ్రీధర్‌లు గెలుపొందారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రతినిధులు రామ్మోహన్, హనుమయ్య, సురేశ్, రహమాన్, కృష్ణంరాజు, మీర్జా సలీం, మహేశ్, తారు, రమేశ్‌తో పాటు జర్నలిస్టులు నితీశ్, వెంకట్‌గౌడ్, సాజిద్, శ్రీకాంత్, గిరీశ్, రాజ్‌కుమార్, కుమార్‌యాదవ్, జర్నలస్టులు పాల్గొన్నారు.

'త్వరలోనే మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక'


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మున్నూరుకాపు సంఘం బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు గణపతి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో సిర్పూర్ మండల కమిటీతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూర్ తాలుకా సంఘం నాయకులు కలిసి జిల్లా కమిటీ ఎన్నికపై సలహాలు, సూచనలు తీసుకున్నారన్నారు. త్వరలోనే జిల్లా కమిటీ ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. సిర్పూర్ తాలుకా కమిటీ సభ్యులను ఆసిఫాబాద్ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిట్ల నారాయణ, సురేశ్, వెంకటేశ్, జక్కయ్య, తిరుపతి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

గోర్‌సేనా ఆధ్వర్యంలో సన్మానం


పగడితో సత్కరిస్తున్న నాయకులు

లింగాపూర్: మండలంలోని మోతీపటార్ గ్రామంలో గోర్‌సేనా రాష్ట్రస్థాయి నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివారం గోర్‌సేనా ఆధ్వర్యంలో గ్రామ నాయక్, కారోబారీ, డావ్‌లకు పగడీతో సన్మానం చేశారు. గోర్‌సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్ మాట్లాడుతూ భాష, సంస్కృతి, సాంప్రదాయాలను ఎప్పుడూ మర్చిపోకూడదన్నారు. ప్రతీ గ్రామంలో నాయక్, కారోబారీలు పగడి నిత్యం ధరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న దినేష్ మటోలియా

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే కొనుగోలుదారులు, పట్టణ ప్రాంత వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ మటోలియా అన్నారు. ఆదివాకం జిల్లా కేంద్రంలోని మార్వా డి ధర్మశాలలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణానికి వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజ లు వస్తారని, అయితే మున్సిపాలిటీ పరిధిలో సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సులబ్ కాంప్లెక్స్ సై తం ఏర్పాటు చేయాలన్నారు. రానున్న రోజు ల్లో ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో సీ వోసీ ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్, కోశాధికారి మనోహర్, ఉపాధ్యక్షుడు తానాజీ నిక్కం, సంతోష్ అగర్వాల్, అమిత్, కట్ట రాజు, మిలింద్, శ్రవణ్ కుమార్, అజ్మీర చంద్రశేఖర్, సురేశ్ పాద్వాల్, నర్సింగ్ పాల్గొన్నారు.

ఇదీ.. రోడ్డే!



కెరమెరి మండలంలోని సావర్‌ఖేడ గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. రోడ్డుపై కనీసం నడిచేందుకు కూడా యోగ్యంగా లేదు. అధికారులకు ఎనిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. - కెరమెరి

పట్టపగలు విద్యుత్ వెలుగులు



విద్యుత్ వృథా అరికట్టాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా స్థానిక అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యానికి ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. వాంకిడి మండలం కనర్‌గాంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం విద్యుత్ దీపాలు వెలుగుతుండటంతో వందల యూనిట్ల విద్యుత్ వృథా అవుతోంది. దీంతో గ్రామ పంచాయతీపై విద్యుత్ బిల్లుల భారం పడుతోంది. రాత్రి సమయాల్లో మాత్రమే విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. - వాంకిడి

చినుకుపడితే చిత్తడే..!



గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్ల సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దహెగాం మండలంలోని కల్వాడతండా గ్రామానికి వెళ్లే దారి మట్టిది కావడంతో గత మూడు రోజుల నుంచి అకాల వర్షాలు కురుస్తుండడంతో రోడ్లు చిత్తడిగా మారాయి. గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - దహెగాం

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- ప్రమాదకరంగా కరెంట్ వైర్లు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు


హైస్కూల్ కాలనీలో ఇంటికి ఆనుకొని కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

సిర్పూర్(టి): మండలకేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఏళ్లుగా కరెంట్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రమాదకరంగా విద్యుత్ తీగలు కిందకు వేలాడటం, చెట్ల కొమ్మల మధ్యలో నుంచి వెళ్లడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతంలో సిర్పూర్(టి)-చీలపెల్లి ప్రధాన రహదారిలో ఉన్న ఇళ్ల పక్కనే ఉన్న విద్యుత్ తీగలు పూర్తిగా చేతికందేలా కిందకు వేలాడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇళ్లలోకి వెళ్లేటప్పుడు ఏమైనా సామగ్రి తీసుకెళ్లాలన్నా, బయటకు తీసుకురావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడకుండా కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ప్రమాదాలు సంభవిస్తేనే అధికారులు స్పందిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు పెరిగి విద్యుత్ వైర్ల మీదకు వచ్చినా చెట్టు కొమ్మలు తొలగించకుండా అలానే ఉంచారు. గాలి దుమారం వచ్చినప్పుడు షాట్ సర్క్యూట్ అయితే సరఫరాలో అంతరాయం వాటిల్లుతుంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



మండలకేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు స్పందించి వాటిని తొలగిస్తున్నారు. కానీ ముందస్తు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.
– బండ సంజయ్‌కుమార్, సిర్పూర్(టి)

అధికారులు స్పందించడం లేదు



విద్యుత్ వైర్లు ఇంటికి ఆనుకుని ప్రమాదకరంగా చేతికి అందేలా వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇళ్లలోకి సామగ్రి, వస్తువులు తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరి చేయాలి.
– ఎల్ములే కిశోర్‌కుమార్, సిర్పూర్(టి)

ఆరోగ్యానికి 'శాఖాహారం'

- కూరగాయలతో మేలు
- విరివిగా ఆకుకూరలు తీసుకోవాలి
- మార్కెట్‌లో మండుతున్న ధరలు


తాజా కూరగాయలు

కెరమెరి: 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. రోజూ వ్యాయామం చేయడంతో పాటు పోషక విలువలతో కూడిన కూరగాయలు, ఆకుకూరలు తినాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి కొన్ని నియమాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసంతో ఉండడానికి పోషక విలువలతో కూడిన ఆహారం మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

అధిక ధరలు..

మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు సామాన్యులు జంకుతున్నారు. ఆదివారం కెరమెరి మార్కెట్‌లో టమాతా కిలో రూ. 40 పలుకగా.. అల్చింత రూ.50, క్యాబేజీ రూ.100, బెండకాయ రూ.100, పచ్చిమిర్చి రూ.120, పత్తాగోబి రూ.80, సిమ్లామిర్చి రూ.150, చిక్కుడు రూ.100లుగా ఉంది. దీంతో వినియోగదారులు కూరగాయల ధరలు చూసి బెంబేలెత్తిపోతున్నారు. వారంలోనే రెండింతలు ధరలు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తాజా పండ్లు, కూరగాయలు..

ప్రతీ వ్యక్తి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని న్యూట్రిషీయన్ వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యానికి తాజా పండ్లు తినాలి. ప్రధానంగా దానిమ్మ,, ద్రాక్ష, ఆపిల్, బత్తాయి, జామా, అరటిపండ్లతో పాటు మొలకెత్తిన గింజలు, సోయాబీన్ మేలు చేస్తాయి. ఇక ఆకుకూరలు మెంతికూర, తోటకూర, గంగవాయి కూర విరివిగా తినాలి. వంకాయలు, బెండకాయలు, బంగాళదుంపలు, బీట్‌రూట్, టమాట, కాకరకాయలు, సోరకాయ, బీర, దొండ తదితర కూరగాయలు శరీరానికి, మనసుకు స్వాంతనం చేకూరుస్తాయి. దీర్ఘకాలిక రుగ్మతలను దూరం చేస్తాయి. పీచుపదార్థాలు ఎక్కువ ఉండే పదార్థాలు తీసుకుంటే జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది.

కూరగాయలు ఎక్కువగా తినాలి



కూరగాయల్లో అధిక ప్రోటీన్లు, విటమిన్లు ఉంటాయి. పప్పుతో పాటు ప్రతీరోజు కూరగాయలు భోజనంలో తీసుకోవాలి. గర్భిణీలు, బాలింతలు ఆకుకూరలు అధికంగా తినాలి.
– సీతారాం, డీఎంహెచ్‌వో

ప్రజల ఆశీర్వాదమే నడిపిస్తోంది

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


సమావేశంలో మాట్లాడుతున్న కోనప్ప

చింతలమానెపల్లి: ప్రజల ఆశీర్వాదమే తనను నడిపిస్తోందని, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం మండలంలోని డబ్బా గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాల కోనేరు అభిమానుల ఆత్మీయ సభలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎన్నో రకాలుగా సేవ చేశానని నిత్యం అందుబాటులో ఉన్నానన్నారు. నియోజకవర్గంలో మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా రహదారులు, వంతెనలు నిర్మించి అభివృద్ధి చేశానన్నారు. తన హయాంలో గిరిజన ఆదివాసీ రైతులకు పోడు పట్టాలు ఇప్పించానని, గిరిజనేతర రైతుల జోలికి అటవీ అధికారులు వెళ్లకుండా చూసుకున్నానన్నారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్‌లు అందులో విఫలమయ్యారని ఆరోపించారు. పోడు రైతుల విషయంలో మంత్రి సీతక్క ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఇందులో ప్రసన్న హరికృష్ణ, కొమురం మాంతయ్య, డుబ్బుల వెంకన్న, నాజిం హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న నాయకులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన గడుగు చంద్రకాంత్‌కు తలమడుగు మాల సంక్షేమ సంఘం శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. చంద్రకాంత్ గత నెల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు కోల్పోయాడు. కాగా బాధిత కుటుంబానికి అండగా మాల సంఘం ఆధ్వర్యంలో అండగా నిలిచారు. ఆదివారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ సంఘ నాయకులతో వెళ్లి రూ.10వేల నగదు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. వారి వెంట నాయకులు గజానన్, పొచ్చన్న, శ్రీనివాస్, ప్రశాంత్, నరేశ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

26, 27న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

ఇంద్రవెల్లి: ఈనెల 26, 27న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సీజన్‌లో సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని వ్యవసాయాధికారి రాథోడ్ గణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న గౌరపూర్‌లో, 27న ముత్నూర్ గ్రామంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యునివర్సిటీ శాస్త్రవేత్తలతో రైతులకు సాగు విధానంపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మొబైల్‌ఫోన్లు అప్పగింత


వాంకిడి: సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ప్రశాంత్


కాగజ్‌నగర్‌టౌన్: సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ ప్రేంకుమార్, ఎస్సై సుధాకర్

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన తాక్‌సాండె శంకర్ అనే వ్యక్తి ఇటీవల తన మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో బాధితుడు శంకర్‌కు ఫోన్ అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై తెలిపారు. ఫోన్‌ను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీమ్‌ను ఆయన అభినందించారు.

కాగజ్‌నగర్‌టౌన్: మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సీఐ ప్రేంకుమార్ అన్నారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన పోతుల సాంబయ్య, సయ్యద్ ముదషీర్‌లు మొబైల్ ఫోన్లను పోగొట్టుకోగా వారి వివరాలను సీఈఐఆర్ పోర్టల్ నందు నమోదు చేయించడంతో పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే ఫోన్‌లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా బ్లాక్ అవుతుందని, పోగొట్టుకున్న ఫోన్ త్వరగా రికవరీ అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, బాధితులు ఉన్నారు.

అన్నదాతల కొను'గోడు'


లారీలు లేక రైతువేదికలో నిల్వ చేసిన ధాన్యం బస్తాలు

- అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు

పెంచికల్‌పేట్: యాసంగి సీజన్‌లో వరి సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. అకాల వర్షాలతో కల్లాల్లోని ధాన్యం తడిసిపోతుండటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతికి అందివచ్చిన పంటను కాపాడుకోవడానికి పగలు, రాత్రి తేడా లేకుండా కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో రైతులు తంటాలు పడుతున్నారు. పెంచికల్‌పేట్‌లో సుమారు 2వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తుండగా ఐకేపీ ఆధ్వర్యంలో కొండపల్లి, ఎల్కపల్లి, ఎల్లూర్, గొంట్లపేట్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కొనుగోళ్లలో జాప్యం..

అకాల వర్షాలు కురుస్తుండటంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల నత్తనడకన సాగుతున్నాయి. ప్రతీరోజు చిరుజల్లులకు రైతులు ధాన్యంపైన టార్పాలిన్‌లు కప్పుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో తేమశాతం ఎక్కువ చూపెడుతుంది. దీంతో నిర్వాహకులు ధాన్యం కాంటా చేయడం లేదు. తేమ, తాలు పేరుతో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వర్షానికి ధాన్యం కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నామని వాపోతున్నారు.

కాంటా చేశారు..



రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. పదిహేను రోజుల క్రితం ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. గత వారం రోజుల క్రితం నిర్వాహకులు 90 బస్తాల ధాన్యం కాంటా చేశారు. లారీలు లేకపోవడంతో వారం రోజులుగా కాంటా చేసిన ధాన్యానికి కాపలాగా కొనుగోలు కేంద్రంలోనే ఉంటున్నాను.
– దూగుంట ఆనంద్, రైతు, ఎల్కపల్లి

ఇబ్బంది పడుతున్నాం..



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. పదిరోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాను. తాలు పేరుతో కొనుగోలు చేయడం లేదు. ఒక వైపు అకాల వర్షాలు, మరో వైపు నిర్వాహకుల తీరుతో ధాన్యం విక్రయించడం కష్టంగా మారింది. నాలుగు రోజులుగా ధాన్యం కాపాడుకోవడానికి కష్టపడుతున్నాను.
– అశోక్, రైతు, ఎల్కపల్లి

విద్యతోనే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

గుడిహత్నూర్: విద్యతోనే ఆదివాసీ జీవితాలు వెలుగులోకి వస్తాయని ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని మాన్కాపూర్ సమీపంలో ఉన్న ఏకలవ్య ఫౌండేషన్ గిరిజన వనరుల కేంద్రంలో నిర్వహించిన కుమురం భీం స్టడీ సర్కిల్ రజతోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలకు ఉన్న విద్యనందించాలనే ఉద్దేశంతో కుమురం భీం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనలు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. ఇక్కడ చదివిన ఆదివాసీ బిడ్డలు ఈరోజు ఉద్యోగాలు సాధించి తమ జీవితాలకు వెలుగులు అద్దడం సామాన్య విషయం కాదన్నారు.

రాజ్‌గోండ్ ఉద్యోగ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బోథ్: మండలంలోని పట్నా పూర్ గ్రామంలో రాజ్‌గోండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బోథ్ మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు నైతం జైతు అధ్యక్షతన ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మండాడి శంబు, అధ్యక్షుడిగా తోడషం భూమన్న, ప్రధాన కార్యదర్శిగా మండాడి నా గోరావ్, కోశాధికారిగా పెందూర్ సోనేరావు, సంస్కృతికా కార్యదర్శిగా మాడవి లాల్‌దేవ్, స లహాదారులుగా పంద్రం శంకర్, ఆర్ఎస్ నా గోరావ్, వెంకట్రావు, మహిళ ప్రతినిధులుగా గంగామణి విజయలక్ష్మి, దేవేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఉద్యోగస్తుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.